క్లుప్తంగా

9 నుంచి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పెద్దముడియం : మండలంలోని ఉలవపల్లెలో వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.70,000, రెండవ బహుమతి రూ.30,000 అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 6305623713, 95333 38481 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి

సింహాద్రిపురం : మండలలోని గురిజాల, బల పనూరు తదితర గ్రామాలలో గెలలతో ఉన్న అరటి ఈదురుగాలులకు నేలకొరిగింది. అరటి రైతులు తీవ్రంగా నష్ట పోయారు. బాధిత రైతులు తెలిపిన మేరకు.. నాలుగు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు అరటి పంట నేలకొరిగింది. కానీ ధరలు లేక పోవడంతో వ్యాపారస్థులు కొంత పంటను కొనుగోలు చేసీ తీసుకెళ్లారు. మిగిలిన పంటల కోసం వ్యాపారస్థులు రాకోపవడంతో రైతులు తోటల వద్దకు వెళ్లలేదు. దీంతో ఆదివారం తోటల వద్దకు వెళ్లి చూస్తే ఈదురుగాలులకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. గురిజాల గ్రామంలో మోహన్‌రెడ్డి, రవీంద్రానాథ్‌రెడ్డి, జయచంద్రారెడ్డి మరి కొంత మంది రైతుల పంటలు ఈదురుగాలులకు పూర్తిగా దెబ్బ తిన్నాయని వారు వాపోతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

తాటి ముంజలు వచ్చేశాయి


విక్రయానికి సిద్ధంగా ఉన్న తాటి ముంజలు

పులివెందుల రూరల్ : వేసవిలో గుర్తుకొచ్చే తాటి ముంజలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. డజన్ తాటి ముంజల ధర రూ. 100లకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. మండలంలోని అచ్చివెల్లి, ఎర్రిపల్లె, ఉల్లిమెల్ల, పుట్రాయునిపేట గ్రామాల్లోని ప్రజలు తాటి ముంజలను తీసుకొచ్చి పులివెందులలో విక్రయిస్తున్నారు. ఇవి తీయగా ఉంటూ నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉంటాయి. ఎండాకాలం ప్రారంభం కాగానే మార్కెట్‌లో తాటి ముంజలు దర్శనమిస్తాయి. శరీరాన్ని చల్లబరిచే తాటి ముంజలు ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. వీటిలో అధికంగా విటమిన్ బి, ఐరన్, కాల్షియం శరీరానికి అవసరం.

వాహనం ఢీకొని జింక మృతి


మృతి చెందిన జింక

చింతకొమ్మదిన్నె : మండలంలోని రింగ్ రోడ్డుపై సాక్షి సర్కిల్ నుంచి మూలవంక వైఎస్సార్ సర్కిల్ మధ్యలో ఆదివారం సాయంత్రం ఆజాద్‌నగర్ సమీపం చెర్లోపల్లె వద్ద రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జింక మృతి చెందింది. చింతకొమ్మదిన్నె పోలీసులు, అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో రుచికరమైన అన్న ప్రసాదాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా విచ్చేసే వేలాదిమంది భక్తులకు నిరంతరాయంగా రుచికరమైన అన్న ప్రసాదాలను టీటీడీ అందిస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ అందిస్తునారు. ఆలయ ప్రాంగణంలో ఎండవేడిమి భక్తులకు ఇబ్బంది లేకుండా జర్మన్ షెడ్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిరోజూ ఉదయం 7.30 గంటలకు అల్పాహారం, ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు రుచికరమైన అన్నం, సాంబారు, రసం, మజ్జిగ, పచ్చడి, కర్రీ, బెల్లం, పొంగలి అందిస్తారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా స్వామివారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు ఆలయ ప్రాంగణంలో శ్రీవారి సేవకులు ద్వారా ఆదివారం ఉదయం నుంచి వడ పప్పు, పానకం పంపిణీ చేశారు. దక్షిణ భారత దేశంలోని రామాలయాలలో శ్రీరామ నవమి సమయంలో శ్రీరాముడికి పానకం, వడపప్పు నైవేద్యంగా సమర్పించిన తరువాత భక్తులకు అందించారు.

నేడు సామూహిక నిరాహార దీక్ష

కడప వైఎస్ఆర్ సర్కిల్: రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఐ నగర కార్యదర్శి యన్.వెంకటశివ కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు, పట్టణాల్లో వారికి రెండు సెంట్ల ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ రూపాయి ఖర్చు చేయలేదన్నారు.

అంతా రామమయం..

- వాడవాడలా పానకం, వడ పప్పు పంపిణీ
- వైభవంగా సీతారాముల కల్యాణం
- భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి ఉత్సవాలు
- సీతారాములను దర్శించుకున్న వైఎస్ మనోహర్‌రెడ్డి


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని వాడ వాడలా శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీరామనామ జపములతో రామ మందిరాలు.. ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీరామనవమి పండుగ సందర్భంగా వాడ వాడలా సీతారాముల చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేసి పానకం, వడ పప్పు పంపిణీ చేశారు. పట్టణంలోని భద్రాది రామాలయం (గీతామందిరం)లో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. రీడింగ్‌రూమ్ వీధిలో ఉన్న రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంచిపెట్టారు. గాడిచర్ల వీధిలో ఉన్న భజనమందిరంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయం, తూర్పు, పడమటి ఆంజనేయస్వామి, కోతి సమాధి, షిర్డిసాయిబాబా ఆలయాలతోపాటు తదితర ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కమనీయంగా సీతారాముల కల్యాణం :
స్థానిక నగరిగుట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. అర్చకులు మురళీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా బాజా భజంత్రీల మధ్య భక్తుల నడుమ శ్రీసీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అలాగే పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరంగనాథస్వామి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. పట్టణంలోని రామాలయాలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో మెకానిక్ శేఖర్ ఆధ్వర్యం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొని భక్తులకు పానకం వడపప్పు అందించారు. అనంతరం నగరిగుట్టలోని శ్రీరామాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న భజనమందిరం, సీతారాముల ఆలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, కౌన్సిలర్ కోడిరమణ, కోఆప్షన్ చంద్రమౌళి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, ఆర్యవైశ్యసంఘ మాజీ అధ్యక్షుడు కొత్త రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, రాగిమానుపల్లె, కనంపల్లె, తుమ్మలపల్లె గ్రామాలలో శ్రీరామనవిమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నవిమి సందర్భంగా అంజనేయస్వామి, ఆలయాల్లో, రామాలయాల్లో నవమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే అంబకపల్లె రోడ్డులోని రజక కాలనీ సమీపంలో రామాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలను ఆలయ అర్చకులు నిర్వహించారు. భక్తులు బారీగా తరలి వచ్చారు. పట్టణంలోని రజక కాలనీలో భక్తులకు బీవీఎస్సాఆర్ ట్రాన్స్‌పోర్టు అధినేత బీవీ సుబారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వేంపల్లెలో..
వేంపల్లె : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీరామనవిమి ఉత్సవాలు 2 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం మొదటి రోజు ఆలయంలో వెలసిన 50 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ సీతారాముల వారికి ఆలయ అర్చకులు సువర్ణ కంకణ బిరుదాంకిత, అలంకార ప్రవీణ, ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో శాశ్వత ఉభయదారులు బైరిశెట్టి గంగిశెట్టి మనవడు బోనగిరి మల్లికార్జున, కల్యాణి దంపతుల చేతుల మీదుగా శ్రీసీతారాముల కల్యాణోత్సవం వేద మంత్రోచ్ఛరణతో తాళమేలాల మధ్య కడు రమణీయం, అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతక ముందు వేంపల్లె పట్టణ పురవీధుల్లో శ్రీసీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బైరిశెట్టి వెంకటకృష్ణయ్య, గంగాధర్, సునీల్, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కల్యాణ మండపం, అవోపా, ఆర్యవైశ్య మహిళా మండలి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి హాజరై తిలకించారు. అలాగే వైఎస్ వివేకానందరెడ్డి కాలనీలో మాజీ ఎంపీటీసీ కొత్తూరు రెడ్డయ్య ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

లింగాలలో
లింగాల : మండలంలోని రామాలయాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వేద పండితులు సీతారామ లక్ష్మణ, అంజనేయస్వామి విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ముస్తాబ్ చేసి సీతారాముల కల్యాణం జరిపించారు. ఆయా గ్రామాలలో ప్రజలు ఆలయాల్లో సీతారాముల కల్యాణత్సోవంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం పల్లికిలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు.

జమ్మలమడుగులో..
జమ్మలమడుగు : పట్టణంలోని నేతాజీ నగర్‌కాలనీలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా స్థానిక కోదండరామస్వామి ఆలయంలో సీతారామ కల్యాణోత్సవం పండితుడు హనుమాన్‌శాస్త్ర నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా సీతాదేవి తరపున జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు, శ్రీరాముడి తరపున గోనా పురుషోత్తం దంపతులు కల్యాణోత్సవంలో ఆశీనులయ్యారు. వేలాది మంది భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. కన్నెలూరు, నేతాజీ నగర్, రామకృష్ణకాలనీ, ఎత్తపువారి కాలనీ ప్రాంతాలకు చెందిన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం వచ్చిన భక్తులకందరికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సీత, రామ, లక్ష్మణుడు, హనుమంతుడు సమేతంగా ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

కమలాపురంలో..
కమలాపురం : మండల ప్రజలు శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం కమలాపురంతో పాటు కె.అప్పాయపల్లె, గంగవరం, విభరాపురం, సంబటూరు, కంచ్నగారి పల్లె, కుంట, కోగటం, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, నల్లింగాయపల్లె, రాజుపాళెం, మీరాపురం తదితర గ్రామాలలో నవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. స్థానిక ఆర్ఎస్ రోడ్డు లో వెలసిన శ్రీ సీతా రామాంజనేయ దేవస్థానంలో, కృష్ణానగర్‌లోని సీతారామాలయంలో, ఎండీఓ కాలనీ రామాలయంలో, కె.అప్పాయపల్లెలోని రామాలయంతో పాటు మండలంలోని రామాలయాలు ఉన్న గ్రామాల్లో ఆలయాల నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వాముల వారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారిని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేశారు.

పెద్దముడియంలో..
పెద్దముడియం : మండలలోని గ్రామీణ ప్రాంతాల్లో రామాలయ, ఆంజనేయస్వామి దేవాలయాల్లో నిర్వాహకులు శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పెద్దపసుపుల గ్రామంలోని చావిడి దగ్గర ఉన్న రామాలయంలో సీతారాములు ఉత్సవమూర్తులకు ఘనంగా కల్యాణం జరిపించారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ఎర్రగుంట్లలో
ఎర్రగుంట్ల : శ్రీరామనవమి పండుగ సందర్భంగా పట్టణం, మండల పరిధిలోని శ్రీరామాలయాలలో నవమి వేడుకలుతో పాటు శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని నడివురులోని శ్రీరామాలయం, వేంపల్లి రోడ్డులోని ఉన్న రామాలయంలో, క్రాంతినగర్ కాలనీలో శ్రీరామాలయంలో, మహేశ్వనగర్ కాలనీలో ఆర్టీపీపీ, చిలంకూరు, వలసపల్లి, కదిరివారిపల్లి, రంగసాయిపురం, మాలెపాడు, కలమల్ల, ఇల్లూరు, చిన్నదండ్లూరు, పోట్లదుర్తి హనుమనుగుత్తి, పెద్దనపాడు, తుమ్మలపల్లి గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాలలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేంపల్లి రోడ్డులోని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు శ్రీ సూర్యట్రాన్స్‌పోర్టు అధినేత సానేపల్లి వెంకటప్రసాద్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

వేములలో..
వేముల : మండల వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్గోని రామాలయాల్లో పానకం, వడపప్పుపెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే రామాలయాలు భక్తులతో నిండిపోయాయి. శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామాల్లో ఏర్పాటుచేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

వీరపునాయునిపల్లెలో
వీరపునాయునిపల్లె : మండలంలోని తాటిమాకుల పల్లె, సంగాలపల్లె, యు.వెంకటాపురం, బుసిరెడ్డి పల్లె, కీర్తిపల్లె తదితర గ్రామాల్లో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. అనంతరం భక్తులకు పానకం, వడ పప్పు పంచి పెట్టారు. సాయంత్రం నిర్వహించిన గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కోలాట కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు ఆలయాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సింహాద్రిపురంలో..
సింహాద్రిపురం : మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గురిజాల గ్రామంలోని రామాలయంలో సీతారాముల కల్యాణం జరిపించారు. వేద పండితులు అనిల్‌కుమార్ సీతారాముల వివాహ ఘట్టాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని రామాలయాల్లో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ముద్దనూరులో..
ముద్దనూరు : శ్రీరామనవమి పర్వదిన వేడుకలు మండల వ్యాప్తంగా వాడవాడలా ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో వెలసిన శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను దర్శించి భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని రాజులగురువాయిపల్లెలో శ్రీసీతా రాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

పెండ్లిమర్రిలో..
పెండ్లిమర్రి : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి గ్రామాల్లో ఉన్న రామాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. చీమలపెంట, చెన్నంరాజుపల్లె గ్రామాల్లో అర్చకుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. చీమలపెంటలో ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు.

వల్లూరులో..
వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలలోని సీతా రామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పానకం, వడపప్పు ప్రసాదాలను అందరికీ పంచి పెట్టారు. ప్రజలు తమ గృహాల్లో పూజలు చేసి పానకం, వడపప్పు ప్రసాదాలను పంచి పెట్టారు. పెద్దపుత్తలోని పురాతన యోగా రామాలయం, వల్లూరులోని హైస్కూలు సమీపంలో గల రామాలయం, కొప్పోలులోని రామాలయాల్లో శ్రీ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవాలను నిర్వహించారు. పెద్దపుత్త గ్రామోత్సవంలో కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంది. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీ, పైడికాలువ తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాలను నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

చింతకొమ్మదిన్నెలో..
చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని గ్రామాలలోని ఆలయాలలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం వేడుకలు నిర్వహించుకున్నారు. ఇప్పపెంట, బోడెద్దులపల్లి, మూలవంక, బుగ్గలేటిపల్లి, ఊటుకూరు, చింతకొమ్మదిన్నె తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణం నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు,


పులివెందుల : కల్యాణంలో సీతారాములు


పులివెందులలో స్వామి వారిని దర్శిచుకుంటున్న భక్తులు


శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు


లింగాల : వెలిదండ్ల రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


వేంపల్లెలో కల్యాణంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి


కమలాపురం : ఆర్ఎస్ రోడ్డులోని కోదండ రామాలయంలో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు


జమ్మలమడుగులో సీతారామల కల్యాణోత్సవంలో ఆభరణాలను చూపిస్తున్న పెద్దలు


వేములలో కల్యాణంలో పాల్గొన్న మహిళలు


వేములలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు


ముద్దనూరు : శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


ఎర్రగుంట్ల : వేంపల్లి రోడ్డులోని రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


వీఎన్‌పల్లె : కల్యాణంలో ఆకట్టుకున్న విగ్రహాలు


చింతకొమ్మదిన్నె గ్రామోత్సవంలో భక్తులు


పెద్దపుత్తలోని పురాతన యోగా రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం


పెద్దపుత్త గ్రామోత్సవంలో అలరించిన కోలాట ప్రదర్శన


చింతకొమ్మదిన్నె : మూలవంక గ్రామంలో శ్రీ సీతారాముల కల్యాణం

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


బీజేపీ ఆవిర్భావ జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీ మార్కెట్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయల విగ్రహం సమీపంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ మార్కెట్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ దేశానికి మొదటి ప్రాధాన్యత, పార్టీకి ద్వితీయ ప్రాధాన్యత వ్యక్తికి తృతీయ ప్రాధాన్యత అనే నినాదంతో ముందుకు వెళుతోందన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..
వేంపల్లె : స్థానిక బీజేపీ నేతలు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర బీజేపీ జెండాను ఆవిష్కరణ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా అవతరించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు పి. సుస్మా, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఇప్పటి వరకూ నమోదు చేసుకోని ప్లాట్ ఫాం కార్మికుల కోసం ఈ నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కార్మికశాఖ జిల్లా అధికారి శ్రీకాంత్ నాయక్ తెలిపారు. ఈ శిబిరాల్లో తమ పేర్లు తప్పక రిజిష్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇతర వివరాలకు హెల్ప్ డెస్క్ నెంబరు 94925 55201లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రాబోయేది.. విసనకర్రల కాలమే



వేసవిలో చల్లదనం కోసం నానావస్థ పడుతున్న ప్రజలకు విసనకర్రల అవసరం వచ్చింది మరి. ఉదయం, సాయంత్రం విద్యుత్తు సరఫరాలో కోతలు ఉండడంతో పేదలు విసనకర్రలతో సేద తీరుతున్నారు. వీటికి ఆదరణ పెరగడంతో మార్కెట్‌లో నాలుగు నుంచి అయిదు రకాల విసన కర్రలు వ్యాపారులు అందుబాటులో ఉంచారు. దేవుని కడప రోడ్డు బీకేఎం స్ట్రీట్ వద్ద విసనకర్ర అముఅమ్ముతున్న దృశ్యాలు సాక్షి కెమెరాకు చిక్కాయి. – రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


శిల్పారామంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు


వైఎస్సార్ లేక్‌ఫ్రంట్‌లో దుర్గా వేషధారణలో చిన్నారుల నృత్య ప్రదర్శన

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామం, వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించారు. పండుగ సందర్భంగా శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి పానకము, వడపప్పు సందర్శకులకు పంపిణీ చేశారు. సాయంత్రం శిల్పారామంలో భాష్యం పాఠశాల చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో శ్రీరాజా కళానిలయం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. సందర్శకులు చప్పట్లతో కేరింతలతో వారిని ఉత్సాహ పరిచారు.